క్లుప్తంగా

వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు సరికాదు

సామర్లకోట: కరోనా సమయంలో వలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు ఎన్నటికీ మరచిపోలేమని, అలాంటి వలంటీర్లపై పవన్‌కల్యాణ్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలోని గొంచాల గ్రామంలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్పిడి వెంకట్రాయుడు, గ్రామ సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

పంచారామ క్షేత్రంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి స్వామివారి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరపున అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఓలేటి కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామానికి చెందిన ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ఓలేటి రాయ భాస్కరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని సోమవారం మాజీ కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ఎంఎం పల్లంరాజు పరామర్శించారు. కార్యక్రమంలో మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, పులగల రాజు, మట్ట ప్రసాద్, ఆకుల వెంకటరమణ, కుక్కల పోతురాజు, పెద్దాడ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తపల్లి: ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన సంగడ లక్ష్మి (55)కి రెండు నెలల కిందట పాము సొంగ తగిలింది. దీంతో ఆమె అనారోగ్యానికి గురికావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు కూలీల ధర్నా


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో సీలింగ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. రైతు కూలీలతో కలిసి సోమవారం ఆయన ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించి తమకే పట్టాలివ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేశెట్టి సురేష్, చేదులూరి లక్ష్మి, నారాయణ మూర్తి, వెంకటరమణ, ఏసురత్నం, చిన్ని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీ వాసులకు పట్టాల పంపిణీ

పెద్దాపురం: స్థానిక లెప్రసీ కాలనీలో అర్హులైన ఆరుగురు లెప్రసీ రోగులకు రెవెన్యూ అధికారులు శాశ్వత ప్రాతిపదికన పట్టాలు మంజూరు చేసినట్లు కుష్టు రోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జొన్నకూటి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టాలు మంజూరు చేసిన ప్రభుత్వం, రెవెన్యూ అధికారులకు లెప్రసీ రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

ముందు జాగ్రత్తే మందు

- తామర పురుగులతో నష్టాలు
- జాగ్రత్తలు అవసరమంటున్న అధికారులు


గొల్లప్రోలు మండలం చెందుర్తిలో మిరప నారుమడులు

పిఠాపురం: సాగు ఏదైనా సస్యరక్షణ చర్యలు చేపడితే బంగారమే.. పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని గుర్తించి ముందుకు సాగితే లాభాలే.. జిల్లాలో వాణిజ్య పంటలలో మిరప అతి ముఖ్యమైంది. ఈ పంటపై తామర పురుగు మొక్క నాటిన నుంచి ఆశించి నష్టపరుస్తోంది. దీనిపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు నల్ల తామర పురుగు (త్రిప్స్ పార్విస్పినస్)గా గుర్తించారు. ఇది రెండేళ్లుగా వేలాది ఎకరాలలో మిరప పంటను నాశనం చేసింది. ఈ పురుగును 2015లో బొప్పాయి పంటలపై గుర్తించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మళ్లీ తామర పురుగు విజృంభించే అవకాశం ఉండడంతో ఉద్యాన శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నాట్లు వేసే నాటి నుంచే జాగ్రత్తలు పాటించాలని గొల్లప్రోలు మండల ఉద్యానశాఖ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో సుమారు 1,100 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. ఇందులో 600 ఎకరాల వరకూ మిరప పంట ఉంటోంది. మిగతా కూరగాయల పంటపై కూడా ఇది ఆశిస్తోంది.

ఏ పంటలకు సోకుతుందంటే..

మిరప, టమోటా, మునగ, చిక్కుడు, దొండ, బంతి, దోస, ధనియాలు, వాము, కాకర, బొప్పాయితో పాటు మినుము, పత్తి పంటలపై ఈ తామర పురుగు ఎక్కువగా ఆశించే అవకాశాలు ఉన్నాయి. ఈ పురుగుకు పిచ్చిదోస, తోటకూర, దువ్వెన బెండ, కుప్పింటాకు, లింగ మిరప, వయ్యారి భామ, కామంచి గడ్డి చామంతి ఇతర గడ్డి జాతుల మొక్కలు ఆశ్రయంగా ఉంటాయి.

ఎలా వృద్ధి చెందుతుందంటే..

ఆడ తల్లి పురుగులు నల్ల రంగులో ఉండి పువ్వులు, లేత ఆకులపై వ్యాపించి ఉంటాయి. మగ పురుగులు లేత పసుపు రంగులో చిన్నగా ఉండి తక్కువ సంఖ్యలో ఉంటాయి. ఒక్కో తల్లి పురుగు 15 నుంచి 20 గుడ్లు పెడుతుంది. తద్వారా 15 నుంచి 20 రోజులకొకసారి పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి. ఈ పురుగులు ఆకులు, పువ్వులపై ఎక్కువ సంఖ్యలో చేరి రసం పీల్చడం ద్వారా మొక్క కణజాలం దెబ్బతిని పూర్తిగా నాశనమవుతుంది.

పాటించాల్సిన చర్యలు

తామర పురుగు సోకితే విచక్షణా రహితంగా సిఫారసు చేయని పురుగు మందులు వాడరాదు. మందు పిచికారి చేసేటప్పుడు మొక్క అన్ని భాగాలు పూర్తిగా తడిసేలా చూసుకోవాలి. అందుకు స్టీల్ ఇంజన్, బ్యాటరీ స్ప్రేయర్ వాడాలి. పంట చుట్టూ 2 నుంచి 3 వరుసలలో రక్షక పంటగా జొన్న, మొక్కజొన్న వేసుకోవాలి. కలుపు మొక్కలు ఏమాత్రం లేకుండా చూసుకోవాలి. పొలాల్లో నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 40 నుంచి 50 మొక్క ఎత్తుకు తగ్గట్టుగా ఏర్పాటు చేసుకోవాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు బవేరియా బస్సీయానా, లికాని సీలియంలికానీ అనే జీవ శిలీంద్ర నాశనులను 5 గ్రాముల లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారీ చేసుకోవాలి. 5 శాతం వేప గింజల కషాయం, వేప నూనె 1 మిల్లీ లీటరు నీటికి 1500 పీపీఎం లేదా 3 వేల పీపీఎం 2 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. వేప నూనెను సిఫార్సు చేసిన ఇతర మందులతో, కానుగ నూనె 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారీ చేసుకోవచ్చు. రసాయనిక మందులపై ఆధారపడకుండా తప్పనిసరిగా వేప నూనె, కానుగ నూనె తదితర సేంద్రీయ మందులు పిచికారి చేసుకోవాలి. పంటలకు సూక్ష్మ పోషకాలు తగిన మోతాదులో అందే విధంగా చూసుకోవాలి. నాటే ముందు మొక్క వేర్లను మైకోరైజా కలిపిన నీళ్లలో ముంచి నాటడం ద్వారా తామర పురుగు ఆశించకుండా చేయవచ్చు.

> **ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి**
>
> 
>
> నల్ల తామర పురుగు సోకక ముందే ప్రతి రైతు అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది సోకితే నష్టం ఎక్కువగా ఉంటుంది. స్థానిక ఉద్యాన శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఎప్పటికప్పుడు పంటను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. అనుమానం వస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఏ ఒక్క పురుగు మందు ద్వారా ఈ పురుగును నివారించడం సాధ్యం కాదు. అందువల్ల తప్పకుండా సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించడం ద్వారా పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.
>
> –అరుణ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి, గొల్లప్రోలు

స్పందించి.. శుభ్రం చేసి


ఓవర్ హెడ్ ట్యాంకులో శుభ్రం చేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: యండపల్లిలో ప్రజలకు సరఫరా చేస్తున్న నీరు కలుషితం కావడంపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం తాగునీరు కలుషితం అనే శీర్షికన వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పర్యవేక్షణలో గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను కార్మికులతో శుభ్రం చేయించారు. పైపు లైన్‌లు పరిశీలించారు. వాకతిప్ప శివారులో ఉన్న నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి తాగు నీరు రంగుమారి వస్తుందని ఆయన వివరించారు.

స్పందనకు ఎనిమిది అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్

పెద్దాపురం: డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ పద్మజ, డీటీ భానుకుమార్‌లు తెలిపారు. స్థానిక స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని, భూ సర్వే చేయించి న్యాయం చేయాలని, తొలగించిన విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్పందనకు వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హోమ పూజలు


ఆలయంలో హోమాలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: ఆషాఢ మాసంను పురస్కరించుకుని ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఆలయంలో రుద్ర సహిత నవగ్రహ యాగాలు జరుగుతున్నాయి. దీంట్లో భాగంగా సాయంత్రం లక్ష్మీగణపతి, నవగ్రహ, రుద్ర సహిత హోమాలు చేశారు. ఆలయ ధర్మకర్త పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు నిర్వహించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

సామర్లకోట: సామర్లకోటలో ఆదివారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కాకినాడ కోర్టుకు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎ.అజయ్ కుమార్, చిత్రాడకు చెందిన పెదపాటి దుర్గాప్రసాద్, జగ్గంపేటకు చెందిన జి.కాటరాజులకు జరిమానా విధించారన్నారు.

గొప్పలు తప్ప మీ పనులేవీ?

- అబద్ధాలు చెబితే ఎవరూ నమ్మరు
- వర్మపై ఎమ్మెల్యే దొరబాబు ధ్వజం
- ఉప్పాడలో గడప గడపకూ..


ఉప్పాడలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: టీడీపీ అభివృద్ధి చేసిందంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్ప, నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే వర్మ చేసిందేమీ లేదని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. సోమవారం ఉప్పాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని దొరబాబు ఆరా తీశారు. నాలుగేళ్లుగా పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పాడను దత్తత తీసుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ అధికారంలో ఉన్న ఐదేళ్లు చేసిందేమీ లేదన్నారు. ఉప్పాడ గ్రామానికి రక్షణగా 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.12.60 కోట్లు మంజూరు చేశారన్నారు. 2008 జూన్ 4న అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి ఎంఎం పళ్లంరాజు, అప్పటి స్థానిక ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయి రెడ్డి సముద్రకోత నివారణకు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఇది గ్రామ తీర ప్రాంతాన్ని 2014 వరకూ రక్షించిందన్నారు. ఇప్పుడు ప్రజల మెప్పు పొందేందుకు టీడీపీ హయాంలోనే రక్షణ గోడ నిర్మించామని ఫ్లెక్సీలు పెట్టుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వర్మ మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా వర్మకు జ్ఞానోదయం కలగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ అతనికి పరాభవం తప్పదన్నారు. అనంతరం స్థానిక సచివాలయం–1ను సందర్శించి పలు రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, కొత్తపల్లి, ఎండపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు మారిశెట్టి సత్తిబాబు, గుండ్ర రాజబాబు, మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి భావన్నారాయణరెడ్డి, సర్పంచులు తమిలిశెట్టి సుబ్బారెడ్డి, నక్కా మణికంఠబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- పెద్దాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం


ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని లబ్ధిదారులకు వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలోని 3, 28, 29 వార్డుల పరిధిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు కలిగిన సంక్షేమ లబ్ధిని వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు గడపా రామలక్ష్మి, సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన


చేబ్రోలులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పిఠాపురం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణ, మండలాల్లో పలువురు వలంటీర్లు సోమవారం పవన్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏ ఆధారంతో వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారో పవన్‌కల్యాణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం పవన్‌కల్యాణ్ చేతకాని తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలో పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన


పంట భూములను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సామర్లకోట: మండల పరిధిలోని వీకే రాయపురం గ్రామంలోని పంట పొలాలను ఎంపీడీఓ కె.శ్రీలలిత సోమవారం సాయంత్రం పరిశీలించారు. తూటేరు డ్రైనులో పూడికతీత కారణంగా రైతుల పంట భూములు నీటిలో మునిగిపోతున్న పరిస్థితులపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'నిర్లక్ష్యానికి మూల్యం' శీర్షికన ప్రచురితమైన సంగతి తెలిసిందే. స్థానిక రైతులు సదరు కథనాన్ని, నీట మునిగిన పొలాల ఫొటోల్ని చూపించి సోమవారం స్పందనలో కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓ శ్రీలలిత వీకే రాయపురం గ్రామం చేరుకుని పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న పంట భూముల్లో నీరు తూటేరు డ్రైను మీదుగా సముద్రంలోకి వెళ్లాల్సి ఉందని, అయితే ఎనిమిదేళ్లుగా డ్రెయిన్‌లో పూడిక తీయకపోవడం వల్ల పొలాల్లో నీరు దిగకపోగా డ్రెయిన్‌లో నీరు తిరిగి పొలాలను ముంచెత్తుతుందని రైతులు తలారి దొరబాబు, ఇంటి రమేష్, వెలమర్తి బుల్లిరాజు, శ్రీనివాసులు వివరించారు. యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క, తూటికాడ తొలగించడానికి అంచనాలు తయారుచేసి పనులు ప్రారంభిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

ముద్దాయికి రిమాండ్

సామర్లకోట: జట్టు మేస్త్రి మృతికి కారణమైన ఆసి జగ్గయ్యకు 21 వరకూ రిమాండ్ విధించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. జి.మేడపాడు శివారులోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో వెల్డింగ్ పనిచేయడానికి వచ్చిన ఏడుగురు ఒడిశాకు చెందిన కార్మికులు జి.మేడపాడులో నివాసముంటున్నారు. వారికి గేదెల సారధి జట్టు మేస్త్రిగా ఉండేవాడు. 3వ తేదీ రాత్రి జరిగిన ఘర్షణలో సారధిని ఆసి జగ్గయ్య వెనక్కి నెట్టేయడంతో సారధి కిందపడి తలకు బలమైన గాయమైంది. కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సారధి మృతి చెందాడు. జగ్గయ్యను సోమవారం కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు.

అలా.. కోత


ఉప్పాడ శివారులో కోతకు గురైన బీచ్‌రోడ్డు

కొత్తపల్లి: సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డు సముద్ర అలల దాడికి కోతకు గురవుతోంది. ఉప్పాడ శివారు ఎస్సీజీఎల్ సమీపంలో బీచ్ రోడ్డు ఒకవైపు పూర్తిగా దెబ్బతింది. ప్రయాణికులు అటుగా వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం


ఉప్పాడలో జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు


సామర్లకోటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దవులూరి దొరబాబు


పెద్దాపురంలో సర్టిఫికెట్ల పంపిణీ

'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: అర్హులందరికీ పథకాలు అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. సోమవారం ఉప్పాడ సచివాలయం–4లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఎమ్మెల్యే సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రభుత్వం 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తుందన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలుత షెడ్యూల్ ప్రకారం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి సర్వే చేసి కావాల్సిన సేవలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకుని టోకెన్ ఐడీ నంబర్ ఇస్తారన్నారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే భృతిని రూ.10 వేలకు, ఆయిల్ సబ్సిడీని రూ.9కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రమాదవశాత్తు మత్స్యకారుడు సముద్రంలో మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకునే ఉద్దేశంతో రూ.10 లక్షలకు పరిహారం పెంచారన్నారు. అమీనాబాదు తీరప్రాంతంలో మేజర్ హార్బర్ నిర్మాణంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు పూర్తిగా మారిపోతాయన్నారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల ప్రత్యేకాధికారి పుష్పామణి, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

ఇటీవల కొత్తపల్లికి చెందిన ఆదిమళ్ల కృష్ణ, వాకతిప్పకు చెందిన పాత్రికేయుడు ఓలేటి రాయభాస్కర రావు, గోర్సకు చెందిన కర్నిడి పూసలరావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెండెం దొరబాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొండెవరానికి చెందిన రాయుడు చంద్రరావు ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

విప్లవాత్మక మార్పుల కోసం..

సామర్లకోట: పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మఱుగులదిబ్బ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు జట్ల మోహన్, మర్రి శేషారావు, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు మాట్లాడుతూ పేదలకు ఎటువంటి రుసుము లేకుండా జగనన్న సురక్ష ద్వారా సేవలందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయభూపాలపట్నంలో..

ప్రజావసరాలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని పెద్దాపురం ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రాయభూపాలపట్నంలో గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.

స్కూటీ చోరీ చేసి.. స్టార్ట్ కాక వదిలేసి..


యువకుడు స్కూటీ తాళం తీస్తుండగా సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యం

సామర్లకోట: పార్కింగ్ చేసిన సుజుకీ యాక్సెస్ స్కూటీని ఇద్దరు యువకులు చోరీ చేసి కొంత దూరం తీసుకెళ్లినా అది స్టార్ట్ కాక వదిలేసి పరారైన ఘటన వేట్లపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నిడదవోలు రాంబాబు ఇంటి బయట స్కూటీని పార్కు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మోటారు సైకిలుపై ఇద్దరు యువకులు వచ్చారు. ఒక యువకుడు పార్కు చేసి ఉన్న స్కూటీ తాళాన్ని సులభంగా తీశాడు. రెండో వ్యక్తి బైక్ నడుపుతూ దొంగిలించిన స్కూటీని కాలుతో నెడుతూ పెదపూడి రోడ్డులోని కడకుదురు వరకూ తీసుకొచ్చారు. అయితే స్కూటీ స్టార్ట్ కాకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. సాయిబాబా గుడి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలన్నీ రికార్డయ్యాయి. స్థానికులు బాధితుడు రాంబాబుకు సమాచారమివ్వడంతో స్కూటీని తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. పోలీసుల పెట్రోలింగ్ లోపం వల్లే మండల పరిధిలో వరుస మోటారుసైకిల్ దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.